క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న జడ్జి వెంకట శేషమ్మ

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్‌లోని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి జగదీశ్వర రావు ఆదేశాల మేరకు ఇక్కడ విద్యార్థులందరికీ సాధారణ వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం గ్రామ సభలో 24 దరఖాస్తులు



నరసాపురంలో గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

పద్మనాభం: మండలంలోని తునివలస పంచాయతీ నరసాపురంలో రీ సర్వేలో తప్పుల సవరణకు బుధవారం నిర్వహించిన గ్రామ సభలో 24 దరఖాస్తులు వచ్చాయి. పేర్లు, విస్తీర్ణం సరి చేయాలని వీరు దరఖాస్తు చేసుకున్నారు. రీ సర్వే డీటీ వరలక్ష్మి దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ కె.ఆనందరావు గ్రామ సభను సందర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర బంగారప్పడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు వితరణ



విద్యార్థులకు సాయం అందిస్తున్న శ్రీరామ్

భీమునిపట్నం: భీమిలి మండలం తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ బుధవారం వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ఫీజులు చెల్లించడంతో పాటు స్టడీ మెటీరియల్ కోసం రూ.పది వేలు అందిస్తున్నానని తెలిపారు. పేద విద్యార్థులకు తమ వంతు సాయం అందిస్తున్నామని ఇంకా అవసరమైన మేరకు సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఊడికల శ్రీనివాసరావు, టి.వి.ప్రసాద రావు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు లక్ష్మీపురం విద్యార్థులు



మొకర వాసు



సునీత

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 ఎంపిక పోటీలు ఇటీవల భీమిలి సన్ స్కూల్ ఆవరణలో జరిగాయి. ఇందులో ప్రతిభ కనబరిచిన ఇద్దరూ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 10 నుంచి నెల్లూరులో జరిగే బాలుర పోటీలలో మొకర వాసు, చిత్తూరులో జరిగే బాలికల పోటీలలో బుత్తల సునీత పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సర్పంచ్ లచ్చుబుగత జగదీశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు గాడు పైడిరాజు, స్కూల్ కమిటీ చైర్మన్ మొకర శంకరరావు, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.లలిత్‌కుమార్ అభినందించారు.



కార్ షెడ్ జంక్షన్ సిగ్నల్ పోలీసు బీట్ బాక్స్ వెనుక వాహనాల పార్కింగ్



మధురవాడ అప్ బ్రిడ్జి, డీ మార్ట్ వద్ద ఫుట్‌పాత్ ఆక్రమణలు



కొమ్మాది సిగ్నల్ వద్ద ఫుట్‌పాత్‌పైనే పార్కింగ్, దుకాణాలు

ట్రాఫిక్ పద్మవ్యూహం

- పార్కింగ్ స్థలంగా హైవే సర్వీసు రోడ్డు
- కార్‌షెడ్ సిగ్నల్‌ను ఆనుకునే వైన్ షాపు
- ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్

మధురవాడ: మధురవాడలో ట్రాఫిక్ సమస్య రాను రాను జటిలమవుతోంది. ఉదయం, సాయంకాలం సమయాల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. సీపీ శంఖబ్రత బాగ్చి మధురవాడలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి, మార్పులు సూచించినప్పటికీ పరిస్థితిలో మార్పు కానరావడం లేదు. ట్రాఫిక్ పోలీసులు వారి ప్రయత్నాలు చేస్తున్నా జీవీఎంసీ నుంచి కనీస చర్యలు కానరావడం లేదు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు, ధ్వంసమైన ప్రాంతాల్లో కనీస మరమ్మతులు చేపట్టకపోవడం వంటివే ఇందుకు నిదర్శనం.

ఈ ప్రాంతాల్లో మరింత ఇబ్బంది

కార్‌షెడ్, డీ మార్ట్, అప్ బ్రిడ్జి, కొమ్మాది జంక్షన్, మధురవాడ అప్ బ్రిడ్జి, రైతు బజార్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు కొనసాగుతునే ఉన్నాయి. ఉదయం సాయంత్రం వేళల్లో ప్రజలు ట్రాఫిక్‌తో నరకం చూస్తున్నారు. ఇక్కడి పరిస్థితిని ఇటీవల ఐటీ పరిశ్రమల ప్రతినిధులు సీపీ శంఖబ్రత బాగ్చి దృష్టికి తీసుకువెళ్లారు. ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన సీపీ, జీవీఎంసీ అధికారులు కూడా తమ వైపు నుంచి చర్యలు చేపట్టాలని కోరారు. జీవీఎంసీ-ట్రాఫిక్ పోలీసుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల సమస్య అపరిష్కృతంగానే ఉంటోంది.



మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద నిత్యం ఇదే పరిస్థితి..

సర్వీసు రోడ్డు మరీ దారుణం

ట్రాఫిక్ సమస్యపై ఉన్నత స్థాయి అధికారులు ఎంతో సీరియస్‌గా ఉన్నా, క్షేత్రస్థాయిలో ఆ మేరకు కసరత్తు కనిపించడం లేదు. కార్‌షెడ్ జంక్షన్‌లో ఓ వైన్ షాపు, పక్కనే ఉన్న భారీ దుకాణాలతో ఇతరులకు మేలు చేసే విధంగా సర్వీసు రోడ్డును పార్కింగ్ స్థలంగా మార్చేశారు పోలీసులు. అన్ని వైపుల నుంచి వాహనాలు సజావుగా వెళ్లిపోతే ట్రాఫిక్ తగ్గుతుంది, కానీ ఇక్కడ పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. మొదట పోలీసు వాహనాలు పార్కింగ్ చేయడంతో ప్రారంభించి.. కొద్దికాలంగా ఈ హైవే సర్వీసు రోడ్డు పబ్లిక్ పార్కింగ్ స్థలంగా మార్చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరైతే ఇక్కడే ఉదయం వాహనాలు పార్క్ చేసి విధులకు వెళ్లిపోతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కింది స్థాయి ట్రాఫిక్ పోలీసు అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేస్తే దురుసుగా ప్రవర్తిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ విషయం సీపీ దృష్టికి తీసుకువెళ్లడానికి సిద్ధం అవుతున్నారు.

ఇదీ పరిస్థితి

- **మిథిలాపురి** వుడా కాలనీ రోడ్డులో రోడ్డు **ప్రారంభం** నుంచి గాంధీ విగ్రహం వరకు **ఫుట్‌పాత్‌లు** ఆక్రమణకు గురయ్యాయి. **సెల్లార్లను** నిబంధనలకు విరుద్ధంగా ఉపయోగించడంతో మాస్టర్ ప్లాన్ రోడ్డులే **పార్కింగ్** ప్రదేశాలుగా మారుతున్నాయి. **ఇదే పరిస్థితి** మధురవాడ, పీఎం పాలెం, కొమ్మాది, శివశక్తినగర్ రహదారుల్లోనూ ఉంది. వీటిని సరిచేయాలి.
- కార్‌షెడ్, కొమ్మాది సిగ్నల్స్, మధురవాడ డైలీ మార్కెట్, రైతు బజార్, డీమార్ట్ తదితర ప్రాంతాలలో ఫుట్ పాత్‌లు ఆక్రమణలకు గురికావడం, కొన్ని చోట్ల ఫుట్ పాత్‌పై పలకలు పూర్తిగా పాడవడంతో కనీసం పాదచారులు కూడా నడవలేని పరిస్థితి ఉంది. దీనిపై చర్యలు తీసుకోవాలి.
- సిగ్నల్స్ వద్ద ఫ్రీ లెఫ్ట్ లైన్‌లో సిగ్నల్ పడిన తర్వాత వాహనాలు సులువుగా పక్కకు పంపించే చర్యలు చేపట్టాలి.



కార్ షెడ్ సిగ్నల్ వద్ద ఫుట్‌పాత్ దుస్థితి

తక్షణ చర్యలు తీసుకుంటాం

ఫుట్ పాత్‌లపై శ్లాబ్‌ల మరమ్మతులు, రీప్లేస్‌మెంట్‌కు నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్‌ను కూడా ఐడెంటిఫై చేశాం. ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు, వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపించేందుకూ చర్యలు చేపడతాం. దీని కోసం అవసరమైన వారందరి సహాయం తీసుకుంటాం.

– పి.సింహాచలం, జోనల్ కమిషనర్, మధురవాడ జోన్

పరిశీలిస్తాం

ట్రాఫిక్ జామ్ ఇబ్బందులు తగ్గాయి. క్రమబద్ధీకరణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం. కార్‌షెడ్ సిగ్నల్ వద్ద సర్వీస్ రోడ్డుపై పార్కింగ్ గురించి పరిశీలించి చర్యలు చేపడతాం.

–సాయి, ట్రాఫిక్ సీఐ, నార్త్ జోన్

డిసెంబరు మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోలు



బోనిలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

తగరపువలస: డిసెంబరు మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు వ్యవసాయశాఖ భీమిలి ఏడీ విజయప్రసాద్ తెలిపారు. ఆనందపురం మండలం బోని, జగన్నాధపురంలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు. క్వింటాల్ ధాన్యం కామన్ రకం ధర రూ.2300, ఏ గ్రేడ్ రూ.2320 అని తెలియజేశారు. అదే విధంగా రాగి పంటకు గిట్టుబాటు ధర క్వింటాల్‌కు రూ.4,290 ఉండటం వలన రెండో పంటగా రాగి వేసుకోవాలని సూచించారు. డీఆర్సీ వ్యవసాయ సహాయక సంచాలకుడు చదువుల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రెండో పంటగా వరి, నువ్వులలో మేలైన రకాలను వేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. మండల ఏవో చావా సంధ్యా రత్న ప్రభ మాట్లాడుతూ రాగి పంటను వెదజల్లుకోవడం కన్నా నాటే పద్ధతిలో ఎకరానికి అదనంగా 5 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో బోని, చందక వ్యవసాయశాఖ అసిస్టెంట్లు జి.దిలీప్ చక్రవర్తి, ఎన్.మాధురి, రైతులు పాల్గొన్నారు.

రూ.కోటి భూమి ఆక్రమణకు టీడీపీ నేత యత్నం

- బాధితురాలి ఆందోళన



పత్రాలను చూపిస్తున్న పాసి సూరమ్మ, కుటుంబ సభ్యులు

కొమ్మాది: జీవీఎంసీ నాలుగో వార్డులోని కోటి రూపాయలు విలువ చేసే తమ స్థలంపై స్థానిక టీడీపీ నాయకులు కన్ను వేసి, ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని బాధితురాలు పాసి సూరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె బుధవారం మీడియా వద్ద తమ గోడు తెలిపారు. 4వ వార్డు జయంతి అగ్రహారంలోని సర్వే నంబరు 5లో 20 సెంట్ల భూమిని 2004వ సంవత్సరంలో చొక్కా అప్పల నరసయ్య వద్ద తాము (పాసి వెంకట్రావు, సూరమ్మ దంపతులు) కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2016వ సంవత్సరంలో తన భర్త వెంకట్రావు మృతి చెందడంతో అప్పటి నుంచి ఈ భూమిని ఆక్రమించేందుకు స్థానిక టీడీపీ నాయకుడు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాడని పేర్కొన్నారు. తమకు స్థలం అమ్మిన చొక్కా అప్పలనరసయ్య కుటుంబ సభ్యుల ద్వారా ఈ స్థలంపై కోర్టులో కేసు వేయించారని తెలిపారు. పది రోజుల క్రితం సదరు టీడీపీ నాయకుడు తన అనుచరులతో స్థలంలోకి వచ్చి, ఫెన్సింగ్ పోల్స్ వేసి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేశాడన్నారు. భర్త చనిపోవడంతో ఒంటరైన తనను భయభ్రాంతులకు గురి చేసి, స్థలాన్ని చేజిక్కించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడన్నారు. ఈ దౌర్జన్యంపై భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కోర్టు పరిధిలో ఉండగా పోల్స్ ఎలా వేస్తారని ప్రశ్నించారు. అధికారం ఉందనే ధీమాతో కోటి రూపాయల విలువ చేసే తమ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని సూరమ్మ కుటుంబ సభ్యులతో కలసి ఆదోళనకు దిగారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

- పొలంలో గడ్డి కోస్తుండగా ఘటన

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో బుధవారం చైన్ స్నాచింగ్ జరిగింది. గ్రామానికి చెందిన మహిళ మెడలోని మూడు తులాల బంగారపు పుస్తెల తాడు, చెవులకు ఉన్న తులం బంగారు దిద్దులను గుర్తు తెలియని దుండగులు తెంపుకొని పోయారు. వివరాలివి.. బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో బంగారమ్మ ఆలయం సమీపంలో వరి పొలంలో కళ్లెంపూడి పార్వతి (48) గడ్డి కోస్తోంది. ఇద్దరు వ్యక్తులు మోటారు బైక్‌పై వచ్చి బైక్‌ను ఆలయం వద్ద రోడ్డుపై ఆపి పార్వతి వద్దకు వెళ్లారు. పార్వతిని మాటల్లో పెట్టి నోరు నొక్కి, కిందకు వచ్చి మెడలోని మూడు తులాల పుస్తెల తాడు, తులం చెవి దిద్దులు తెంపుకొని పోయారు. పార్వతి కుమారుడు గౌరునాయుడుకు పది రోజుల క్రితం వివాహం జరగడంతో, ఆ పెళ్లి కోసం ఈ ఆభరణాలను చేయించుకుని ఒంటికి పెట్టుకుంది. చేయించుకున్న కొద్ది రోజులకే ఆభరణాలు అపహరణకు గురవడంతో పార్వతి, కుటుంబసభ్యులు లబోదిబోమంటున్నారు. దిద్దులు తెంపడంతో చెవులకు గాయాలై రక్తం కారుతోంది. పార్వతి ఇచ్చిన ఫిర్యాదు ఇచ్చిన మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన పార్వతి

'కల్యాణకృష్ణ'లో నీరు కలుషితం

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సంగివలస కల్యాణకృష్ణ రెసిడెన్సీలోని మూడు అపార్ట్‌మెంట్లలో అండర్ గ్రౌండ్ పైపులు పగిలిపోవడంతో బోరుబావులు కలుషితమై ఇబ్బంది పడుతున్నామని అపార్ట్‌మెంట్‌వాసులు మోహన్‌కుమార్, చిరంజీవి, మాధవరావు, శ్రీనివాస్, శేషాద్రి బుధవారం తెలిపారు. దీనిపై ఈ నెల 4వ తేదీన భీమిలి జోనల్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు కూడా దాఖలు చేశామన్నారు. ఈ మూడు అపార్ట్‌మెంట్లలోని సుమారు 70 వరకు కుటుంబాలతో 300 మంది వరకు నివసిస్తున్నారన్నారు. ఈ కలుషిత నీటిని వినియోగించడం వలన దగ్గు, జ్వరం, దురదలు, వాంతులు, విరేచనాలతో బాధ పడుతున్నారని తెలిపారు. తాగునీటి అవసరాలకు వాటర్ కేన్‌ల ద్వారా నీటిని కొనుగోలు చేసుకుంటున్నా, బోర్లలో చేరిన మురుగునీరు కారణంగా దుర్వాసన వదలడం లేదన్నారు. ఇక్కడ శిథిలమైన డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించడానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి కూడా సమస్యను తీసుకువెళ్లామన్నారు. అధికారులు స్పందించి, తమ సమస్య పరిష్కరించాలని లేకుంటే వ్యాధులు మరింత వ్యాప్తి చెందే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

బోరు నీరు పట్టేదెలా?



ఇసుకతో కప్పేసిన బోరు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు సచివాలయ సమీపంలో ఇంటిని నిర్మిస్తున్న ఓ వ్యక్తి నిర్మాణ సామాగ్రి పిక్క, ఇసుకను రోడ్డు మీదే వేసేశాడు. అంతే కాకుండా స్థానికులు ఉపయోగించుకుంటున్న బోరును కూడా ఇసుకతో కప్పివేయడంతో స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల నుంచి బోరు చుట్టూ ఇసుక ఉండటంతో ఇబ్బంది పడుతున్నామని, సచివాలయంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రైనేజీలపై డెబ్రిస్



డ్రైనేజీ వద్ద స్థానికులు వేసిన డెబ్రిస్

తగరపువలస: రెండోవార్డు సంతోపేట గొల్లవీధి నుంచి ఆదర్శనగర్ వైపు ఈఎస్ఐ ప్రహరీకి ఆనుకుని ఉన్న డ్రైనేజీని స్థానికులు పూడ్చేశారు. ఇప్పటికే పలువురు శాశ్వతంగా నిర్మాణాలు కట్టేసుకోగా.. మరికొందరు దుకాణాలు పెట్టేశారు. ఇప్పుడు శుభం అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకుని ఉన్న డ్రైనేజీలను స్థానికులు డెబ్రిస్‌తో పూడ్చేశారు. వర్షం వస్తే రోడ్డుకు ఇరువైపులా నీరు ప్రవహించేందుకు డ్రైనేజీలు లేక రోడ్డుమీదే రెండు అడుగుల మేర నీరు నిలిచిపోతోంది. సమస్యను గుర్తించి, డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించాలని ఆదర్శనగర్ వాసులు కోరుతున్నారు.

గోస్తని వంతెన వద్ద పశువుల వ్యర్థాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు వెంకటేశ్వరమెట్ట నుంచి గోస్తని నదిపై వంతెనకు వెళ్లే మార్గంలో రహదారిని ఆనుకుని పశువుల, మటన్, కోళ్ల వ్యాపారులు నిత్యం వ్యర్థాలను పారవేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించేవారు ఆ ప్రాంతానికి వచ్చేసరికి దుర్గంధం భరించలేక ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా ఈ వ్యర్థాలు ఎండి, పక్షుల ద్వారా పవిత్ర గోస్తనినది తీరంలో చేరుతున్నాయి. దీంతో ఆ ప్రాంతం కలుషితమవుతోంది. గతంలో చాలాసార్లు వ్యాపారులు ఇలా వ్యర్థాలను నిర్లక్ష్యంగా రోడ్డు పక్కనే పడేసిన సందర్భాలు ఉన్నాయి. అయినప్పటికీ వీరిపై గట్టిగా చర్యలు తీసుకోకపోవడంతో వ్యాపారులలో మార్పు రావడం లేదు. వీరిని గుర్తించి, జాతీయ రహదారుల వెంట అపరిశుభ్రతకు తావు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వెంకటేశ్వరమెట్ట వద్ద వంతెనను ఆనుకుని వ్యాపారులు వేసిన పశువుల వ్యర్థాలు

యథేచ్ఛగా మంచినీటి అక్రమ రవాణా



తిమ్మాపురంలో ట్యాంకర్‌కు నీరు పంపిస్తున్న దృశ్యం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు తిమ్మాపురం విజ్ఞాన్ స్కూల్ సమీపంలో, కాపులుప్పాడలో మంచినీటి అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. మోటర్ల ద్వారా భారీ ట్యాంకర్లకు నీరు తోడి, వేలల్లో సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై గతంలో తహసీల్దార్ టి గోవింద నోటీసులు ఇచ్చినా లెక్క చేయకుండా మంచినీటి అక్రమ రవాణా కొనసాగుతోంది. ఇప్పటికే తిమ్మాపురం, రామాద్రి, మంగమారిపేట, కె.నగరపాలెం, కాపులుప్పాడ ప్రాంతాల్లో భూగర్భ జలాలు ఎండిపోతున్నాయి. తీర ప్రాంతంలో ఎక్కడ బోరు తవ్వినా ఉప్పునీరు పడుతోంది. ఇలాంటి తరుణంలో భారీ ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తే భవిష్యత్తులో తీవ్ర కొరత ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకుని ఇక్కడ బోర్లు మూసివేయాలని, లేకుంటే తాము కలెక్టర్ ఆఫీసు వద్ద ధర్నాకు దిగుతామని తెలిపారు.

జడ్జీలకు రెవెన్యూ రికార్డులపై అవగాహన



జడ్జీలకు రెవెన్యూ రికార్డుల గురించి వివరిస్తున్న తహసీల్దార్ ఆనందరావు

పద్మనాభం: రెడ్డిపల్లి సచివాలయంలో ఆరుగురు జడ్జీలకు రెవెన్యూ రికార్డులపై తహసీల్దార్ కె.ఆనందరావు బుధవారం అవగాహన కల్పించారు. యలమంచిలి జూనియర్ డివిజన్ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి పి.స్వాతి భవాని, యలమంచిలి జూనియర్ డివిజన్ అడిషనల్ సివిల్ జడ్జి టి.వీర రాఘవేంద్రరావు, విశాఖపట్నం జూనియర్ డివిజన్ రెంట్ కంట్రోలర్ కమ్ నాల్గో అడిషనల్ సివిల్ జడ్జి నికిత సెంగర్, నర్సీపట్నం జూనియర్ డివిజన్ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి ఎస్.మధుసూదనరావు, స్పెషల్ మొబైల్ కోర్టు ఫస్ట్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్, విశాఖపట్నం జూనియర్ డివిజన్ ఏడోఅడిషనల్ సివిల్ జడ్జి కె.లలితా దేవి, నర్సీపట్నం జూనియర్ డివిజన్ అడిషనల్ సివిల్ జడ్జి ఎం.రోహిత్‌లకు రెవెన్యూ రికార్డులు, ఆర్‌ఓఆర్, ఫెయిల్ అడంగల్‌పై అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో భూమిని నాలుగు వైపులా ఎలా కొలుస్తారో తెలియజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు.

వీవోఏల ఆందోళన



పద్మనాభం వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వీవోఏలు

పద్మనాభం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వెలుగు కార్యాలయం వద్ద వీవోఏలు బుధవారం ఆందోళన చేపట్టారు. మూడు రోజుల పాటు తమ నిరసన కొనసాగుతుందని తెలిపారు. వీవోఏల ఉపాధిని దెబ్బతీసే మూడేళ్ల కాల పరిమితిని రద్దు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, రాజకీయ వేధింపులు లేకుండా, తొలగింపులు జరగకుండా చూడాలని, రూ.10లక్షల గ్రూప్ ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 15 సంఘాల లోపు ఉన్న వీవోఏలకు వేతనాలు చెల్లించాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం అధ్యక్షురాలు కె.కంచమ్మ, కార్యదర్శి ఆర్.రామలక్ష్మి, వీవోఏలు పాల్గొన్నారు.

భీమిలిలో..

భీమునిపట్నం: తమకు ప్రభుత్వం పెడుతున్న ఉద్యోగ భారాన్ని తగ్గించి సరైన జీతాలను ఇవ్వాలని కోరుతూ మండల పరిధి వెలుగు మహిళ సంఘాల యానిమేటర్లు బుధవారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద సీఐటీయూ సహకారంతో ఆందోళన నిర్వహించారు. ఇందులో పాల్గొన్న యానిమేటర్ల సంఘం నాయకురాలు ఉత్తడ పార్వతి మాట్లాడుతూ పని భారాన్ని పెంచేస్తూ.. చాలీ చాలని జీతాలు చెల్లించడంతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. సీఐటీయూ నాయకుడు ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ వీరి సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ప్రభుత్వం వాటిని పరిష్కరించాలని కోరారు. కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని, బకాయిలను అందించాలని, పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు పోతిన వెంకటలక్ష్మి, కానాడ కల్యాణి, సమ్మటి గున్న, సంతోషికుమారి, నిర్మల పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

తగరపువలస: ఆనందపురం మండలం గొట్టిపల్లి వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పోలిపల్లి కాశీవిశ్వనాథ్ (49) అనే వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆనందపురం సీఐ వాసునాయుడు తెలియజేసిన వివరాలివి.. గొట్టిపల్లిలో నివసిస్తున్న కాశీ విశ్వనాథ్ జిరాక్స్ కోసం వచ్చి, తిరిగి వెళ్తుండగా ఆనందపురం నుంచి గొట్టిపల్లి వైపు వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాశీవిశ్వనాథ్‌ను చికిత్స కోసం మధురవాడ గాయత్రీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ మృతి చెందారు. మృతుని భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల దుకాణం తొలగింపు



వేములవలస ఫ్లై ఓవర్ కింద ఫుట్‌పాత్‌పై కూరగాయల దుకాణం తొలగిస్తున్న పోలీసులు

తగరపువలస: వేములవలస ఫ్లై ఓవర్ కింద ఫుట్‌పాత్‌పై వివాదాస్పదంగా మారిన కూరగాయల దుకాణాన్ని ఆనందపురం లా అండ్ ఆర్డర్ పోలీసులు ఎట్టకేలకు బుధవారం తొలగించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా ఉన్న ఈ కూరగాయల దుకాణం వద్ద నిర్వాహకులకు, వినియోగదారులకు మధ్య మంగళవారం వివాదం జరగడం, పోలీసుల జోక్యంతో సద్దుమణగడం తెలిసిందే.

తునివలస సచివాలయం తనిఖీ

పద్మనాభం: మండలంలోని తునివలస సచివాలయాన్ని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. సచివాలయంలో అటెండెన్స్, మూవ్‌మెంట్, ఈ-రిజిస్టర్లు పరిశీలించారు.